విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 139 | శనివారం 19. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ తెలంగాణ వాణి) గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన ధ్యేయమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం యాదాద్రి కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదివిన ఎంతోమంది యువతకు సరైన ఉద్యోగ అవకాశాలు లభించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగాలు లేక యువతతో పాటు వారికి కుటుంబాలు తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకే కోదాడలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ జాబ్ మేళాకు దాదాపు 300 ప్రముఖ కంపెనీలు మిగతా 2లో..



# కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలి

## ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై సీఎం విజ్ఞప్తి

- కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి
- దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనడానికి శివరాజ్ సింగ్ చౌహాన్
- వర్షాభావం, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్ర మంత్రి దృష్టికి..
- వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది
- తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని వెల్లడి
- పంటల మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించాలి
- 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తున్నాం
- రాష్ట్రంలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలి
- రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలి
- దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నాం
- అలాగే సన్న వడ్లకు రూ. 500 బోనస్‌ను అందించి ప్రోత్సహిస్తున్నం.

## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్ తెలంగాణ వాణి)

తెలంగాణ ఆర్టీసీలో కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబరు 9న ఎన్నికలు నిర్వహించి, 17న ఫలితాలు వెల్లడించనున్నట్టు అధికారులు తెలిపారు. 2016 జులై 19న ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించగా.. మళ్లీ ఇప్పుడు జరుగుతున్నాయి.

గుర్తింపు ఇలా..: ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన సంఘాలనే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు సంఘాలు రీజియన్, రాష్ట్రస్థాయిలో ఉంటాయి. రెండింటికీ వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహిస్తారు. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏలు, సర్వీస్ నిబంధనలు తదితర సమస్యలపై సంస్థ యాజమాన్యం ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టబద్ధమైన హక్కు ఈ సంఘానికే ఉంటుంది. కార్మికుల తరపున ఒప్పందాలు చేసుకోవడంలోనూ గుర్తింపు సంఘం కీలకంగా వ్యవహరిస్తోంది. రీజియన్‌లో పనిచేసే అధికారి స్థాయి మినహా మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరికీ ఓటు హక్కు ఉంటుంది. 2018లో ఈ ఎన్నికలు జరగాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం నిర్వహించలేదు.

## దానం నాగేందర్ సుప్రీంకోర్టుకు వెళ్లకుండా రాజీనామా చేయాలి

- భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- సుప్రీం కోర్టులో రేపు కేవియట్ పిటిషన్ వేస్తాం
- “దానం నాగేందర్‌పై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం.
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భాజపా పోరాడుతుంది.
- ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే వారికి కోర్టు తీర్పు చెంపపెట్టు.
- ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ బుద్ధి తెచ్చుకోవాలి.
- మిగిలిన వాళ్లతో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లాలి”



## ఎర్రవల్లిలో రెండోరోజూ భూముల సర్వే



మర్కూక్: సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లోని భూములపై రెండోరోజూ అధికారుల సర్వే కొనసాగుతోంది. ప్రభుత్వ భూముల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూములపై ఆరా తీశారు. ఆ సర్వేనంబర్‌లో ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూమి ఉందో శాటిలైట్ సర్వే చేస్తున్నారు. సర్వేనంబర్లు, గతంలో ఉన్న రైతుల పేర్ల వివరాలను సైతం సేకరిస్తున్నారు. ఈ వివరాలను మర్కూక్ రెవెన్యూ అధికారులు నివేదిక రూపంలో సిద్ధం చేస్తున్నారు. గురువారం 3 గ్రామాల సరిహద్దు భూములను గుర్తించి మార్కింగ్ చేశారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజ్‌పూర్ సరిహద్దులోని భూములను సర్వే చేస్తున్నారు.

## ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు



- దానం విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది.
- అతనిపై అనర్హత వేటు వేస్తూ సీజే ధర్మాసనం ఉత్తర్వులు జారీ
- బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం.. కాంగ్రెస్ పార్టీలో చేరారు
- అయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్.. స్పీకర్‌కు ఫిర్యాదు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో విచారణ చేపట్టిన స్పీకర్..
- చట్టపరంగా దానం పార్టీ మారలేదంటూ మార్చి 11న తీర్పు నిచ్చారు.
- స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు పలు ఆధారాలు సమర్పించారు
- సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ మార్చి 11న తీర్పు ఇచ్చిందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.
- స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తి స్థాయిలో విచారణ
- సీజే ధర్మాసనం ఇవాళ తుది తీర్పు వెలువరించింది.

## రేవంత్.. మా ఆస్తులు తీసుకుని రూ.వెయ్యి కోట్లు ఇవ్వండి



హైదరాబాద్ తెలంగాణ వాణి)

బీఆర్ఎస్ నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మ్యానిఫెస్టో అమలుపై కాకుండా బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేశారని ఆరోపించారు. ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో విచారణకు హాజరైన అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు.

“కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్లు కొల్లగొట్టినట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఆయనకు ఆఫర్ ఇస్తున్నా.. మా ఆస్తులు తీసుకుని రూ.వెయ్యి కోట్లు ఇవ్వండి. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెడతా. రూ.లక్ష కోట్లలో మిగిలిన రూ.99 వేల కోట్లతో పథకాలు అమలు చేయండి. పెట్టుబడులు తెచ్చేందుకు ప్రయత్నిస్తే మాపై కేసులు పెట్టారు. హైదరాబాద్‌కు 70 కి.మీ దూరంలో అప్పట్లో ఎకరా రూ.5లక్షల చొప్పున కేసీఆర్ భూమి కొన్నారు. వెయ్యి ఎకరాలు ఆయన దోచుకున్నట్లు గతంలో అసత్య ప్రచారం చేశారు. ఇటీవల 67 ఎకరాలే ఉన్నట్లు అసెంబ్లీలో రేవంతే చెప్పారు. ఎన్ని కేసులు పెడతారో పెట్టుకోండి.. ఏం చేయలేరు” అని కేటీఆర్ అన్నారు.

## ‘హిందీని వద్దంటే కుదరదు’

మీ మనస్తత్వం మార్చుకోండి

విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు



హైదరాబాద్ తెలంగాణ వాణి) జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. “తమిళనాడు గడ్డపై హిందీ బోధించబోమని చెప్పడం కుదరదు” అని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నవోదయ పాఠశాలల స్థాపనకు అవసరమైన స్థలాలను గుర్తించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని సూచించింది.

జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేస్తూ, “మీరు మీ మనస్తత్వాన్ని మార్చుకోవాలి. నవోదయ విద్యాలయాలు కేంద్రం ఇస్తోంది.. వీటి వల్ల మిగతా 2లో..

## నిజాంను ఆదర్శంగా తీసుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ భూదోపిడీ: రాంచందర్ రావు

హైదరాబాద్ తెలంగాణ వాణి)



కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నిరంకుశ నిజాం పాలకుడిని ఆదర్శంగా తీసుకుంటూ ప్రజాధనాన్ని, భూములను యథేచ్ఛగా దోచుకుంటు న్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. నాడు మాజీ సీఎం కేసీఆర్ నిజాంను పొగిడితే, నేడు అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి అదే నిజాంను కీర్తించడం అత్యంత సిగ్గుచేటని దుయ్యబట్టారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా పేరొందిన నాటి నిజాం తరహాలోనే, తాము కూడా దేశంలోనే అపర కుభేరులుగా ఎదగాలనే ఏకైక దురాశతో కేసీఆర్, రేవంత్ రెడ్డిలు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆయన ఘాటుగా ఆరోపించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సాగిన అడ్డగోలు భూదోపిడీ తో పాటు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెరపైకి వచ్చిన వివాదాస్పద ‘22ఏ’ భూ కుంభకోణాలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఎవరితో పొత్తులు లేకుండా ఒంటరిగానే బరిలోకి దిగుతుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, అధికారం చేపట్టిన వెంటనే బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు సాగించిన భూకబ్జాలు, అవినీతి దందాలపై విచారణ జరిపించి దోషులను జైలుకు పంపి తీరుతామని హెచ్చరించారు.

## యుద్ధంలో మేమే గెలుస్తాం.. ఉపఎన్నికకు రెడీ



తెలంగాణ హైకోర్టు తనపై అనర్హత వేటు వేస్తూ ఇచ్చిన తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించే విషయంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, దానిపై ఆలోచించాల్సి ఉందన్నారు.

రాజకీయాల్లో పోరాటాలు తనకు కొత్త కాదని, తాను యుద్ధం చేసే ఈ స్థాయికి వచ్చానని దానం నాగేందర్ వ్యాఖ్యానించారు. రాబోయే ఉపఎన్నికలను పూర్తిగా స్వాగతిస్తున్నామని, ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పోటీ చేయడం, కొట్లాడటం తనకు అలవాటేనని, మళ్లీ పోరాడి కచ్చితంగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ రాజకీయ యుద్ధంలో చివరికి తామే విజయం సాధిస్తామని, ఉప ఎన్నికల్లో పోటీకి సంపూర్ణంగా సిద్ధమవుతున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ ఉపఎన్నిక యుద్ధంలో విజయం తమదేనని స్పష్టం చేశారు.

## మీనాక్షి నటరాజన్‌కు దెబ్బ మీద దెబ్బ.. విదేశాలకు వెళ్లకుండా ఆపాలని కోర్టులో పిటిషన్

హైదరాబాద్ తెలంగాణ వాణి)



తెలంగాణ ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి, కాంగ్రెస్ సీనియర్ నేత మీనాక్షి నటరాజన్ చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. ఒకవైపు ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఆమె విదేశీ పర్యటనపై న్యాయపోరాటం మొదలైంది. ఉన్నత చదువుల నిమిత్తం మీనాక్షి నటరాజన్ లండన్ వెళ్లనున్నారనే ప్రచారం నడుస్తున్న వేళ, ఆమె విదేశాలకు వెళ్లకుండా అడ్డుకోవాలని కోర్టులో పిటిషన్ దాఖలైంది. కంభం శివకుమార్ రెడ్డి కేసులో బాధితురాలైన శ్రీలత తాజాగా నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. మీనాక్షిపై ఇప్పటికే రెండు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఈ నేపథ్యంలో ఆమె విదేశాలకు వెళ్లకుండా ఆమె పాస్‌పోర్ట్‌ను తక్షణమే జప్తు చేయాలని శ్రీలత కోర్టును అభ్యర్థించారు.

ఇదిలా ఉండగా గత జూన్‌లో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన మీనాక్షి నటరాజన్‌కు ఎన్నికల కమిషన్ (ఈసీ) గట్టి షాక్ ఇచ్చింది. ఆమె దాఖలు చేసిన నామినేషన్‌ను ఈసీ తిరస్కరించింది. అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలతో పాటు తనపై ఉన్న కేసుల సమాచారాన్ని సరిగ్గా వెల్లడించలేదని బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. నాడు ఆమె నామినేషన్ తిరస్కరణకు గురికావడానికి కారణం అయిన కేసులో బాధితురాలు శ్రీలతే ఇప్పుడు మీనాక్షిని విదేశాలకు వెళ్లకుండా అడ్డుకోవాలని కోర్టును ఆశ్రయించారు. దీంతోఇప్పటికే ఎంపీ పదవి దక్కకుండ పోగా ఇప్పుడు విదేశీ పర్యటన విషయంలో కొత్త మెలిక మీనాక్షి నటరాజన్ కు ఎలాంటి చిక్కులు తీసుకువస్తుందో చూడాలి.

## అక్రమ గంజాయి సాగు.. ఇద్దరిపై కేసులు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఆదిలాబాద్ రూరల్ మండలం పొటంలొద్ది గ్రామ శివారులో వ్యవసాయ పొలాల్లో అక్రమంగా సాగు చేస్తున్న 385 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.38.50 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మెస్రం గంగారాం పటేల్ పొలంలో 315, మెస్రం నాగు పొలంలో 70 గంజాయి మొక్కలు గుర్తించి రెండు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. నిందితులు పరారీలో ఉన్నారని, దర్యాప్తు కొనసాగుతోందన్నారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. గంజాయికి సంబంధించిన సమాచారాన్ని 8712659973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. దాడుల్లో రూరల్ సీఐ రహీం పాషా, ఎస్ఐ వి. విష్ణువర్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గణేష్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ప్రధాన ఘాట్ల వద్ద క్రేన్లు, లైటింగ్, జనరేటర్లు, ఈతగాళ్లు, లైఫ్‌జాకెట్లు, బోట్లు, తాగునీరు, వైద్య, పారిశుద్ధ్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పెన్‌గంగా నది, చందా వాగు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారుల్లో పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా, గస్తీ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, అనూష, డీఎస్పీ జీవన్, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోక్ష కర్ర గణపతికి ప్రజా ట్రస్ట్ చైర్మన్ ప్రత్యేక పూజలు



**నిర్మల్--లోకేశ్వరం, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్‌లో ప్రతిష్ఠించిన మోక్ష కర్ర గణపతిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అబ్దుల్లాపూర్ మరింత అభివృద్ధి చెందాలని గణనాథుడిని ప్రార్థించారు. గణేష్ ఉత్సవాలను గ్రామస్తులు ఐకమత్యంతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భోజన్న, మాజీ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువత భక్తులు పాల్గొన్నారు.

## రైతు కూలీ సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

**టేకులపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి)**




ఖమ్మంలో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం 4వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం పిలుపు నిచ్చింది. స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. రైతాంగ, పోడు భూముల సమస్యలపై సంఘం సాగించిన పోరాటాలను ప్రస్తావిస్తూ, మహాసభలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విద్యార్థులు, యువత, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి తోటకూరి సతీష్‌కుమార్, అధ్యక్షుడు కోడెం రవి, నాయకులు భూక్య లక్ష్మణ్, జార్జ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జనం

**టేకులపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి)**
వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని టేకులపల్లి సీఐ సత్యనారాయణ సూచించారు. నిమజ్జన ఏర్పాట్లపై టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిరుపతి సమక్షంలో డీజే నిర్వాహకులు, గణేష్ మండలి ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు నిమజ్జన ఊరేగింపుల్లో డీజేల వినియోగం పూర్తిగా నిషేధించామని సీఐ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే డీజే సౌండ్ సిస్టమ్‌లను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ తిరుపతి, పోలీసు సిబ్బంది, డీజే నిర్వాహకులు, గణేష్ మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.



## తప్పుల్లేకుండా ధృవపత్రాల అప్ లోడింగ్: సీఈఓ సుదర్శన్ రెడ్డి



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నోటీసుల హియరింగ్, ధృవపత్రాల అప్ లోడింగ్ లో ఏలాంటి తప్పులు జరుగకుండా పటిష్టంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నోటీసుల హియరింగ్, ధృవపత్రాల ఆప్ లోడింగ్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఉప్పల్, హబ్సిగూడ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, జిల్లా ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిలు సీఈఓకు పుష్పగుచ్ఛం అందించారు. ఓటును నిర్ధారించే ప్రక్రియ, ఎన్నికల సంఘం నిర్ధారించిన ధృవీకరిణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన, ధృవీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.

జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) హియరింగ్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను, సూపర్వైసర్లను, బీఎల్ఓలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. జిల్లాలో మ్యాప్పింగ్ జరగకుండా ఉన్న ఓటర్లు మరియు ఓటర్ కార్డ్ లో ఉన్న వ్యత్యాసాల కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, నోటీస్ అందిన ఓటర్లు హియరింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన ఆధారాలను ధృవీకరించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.

అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదు అయ్యేలా, సంబంధిత పత్రాల పరిశీలన లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పనులను కొనసాగించాలని సూచించారు. హియరింగ్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించి, ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బిఎల్ఓలు నిర్వహిస్తున్నరిజిష్టర్లను, కంప్యూటర్లో ధవృపత్రాల అప్ లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ తహాసీల్దార్ పూల్ సింగ్, డిప్యూటి కమిషనర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్ వైజర్లు , బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనాని ఐడీఎల్ చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్

కూకట్‌పల్లిలోని ఐడీఎల్ చెరువు అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో గణేష్ నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చేసిన ఏర్పాట్లను హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం పరిశీలించారు. ఎత్తైన విగ్రహాలు నిమజ్జనం అయ్యేలా 25 అడుగులకు పైగా చెరువు లోతును పెంచారు. వేలాదిగా తరలివచ్చిన విగ్రహాలను ఐడీఎల్ చెరువులోకి చేరేలా ప్రధాన రహదారి వైపు ఏర్పాట్లు చేసిన భారీ క్రేన్లను కూడా హైడ్రా కమిషనర్ సంబంధిత శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. నిమజ్జనం జరుగుతుండగానే చెరువులో వేసిన విగ్రహాలను తొలగించేందుకు చేసిన ఏర్పాట్లను హైడ్రా కమిషనర్‌కు అధికారులు వివరించారు.

చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్న పరిస్థితుల్లో నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను గతంలో హైడ్రా కమిషనర్ ఆదేశించారు. ఆ మేరకు జరిగిన ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. 25 అడుగులకుపైగా ప్రధాన రహదారిని ఆనుకుని ఐడీఎల్ చెరువులో పూడిక తీసి నీటితో నింపడం పట్ల సంతృప్తి చెందారు. నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులతో నిరంతరం పర్యవేక్షించాలని.. సమన్వయంతో పని చేయాలని హైడ్రా అధికారులను కమిషనర్ రంగనాథ్ సూచించారు.

ఐడీఎల్ చెరువు సందర్శన అనంతరం ఆ పక్కనే ఉన్న ఆంజనేయనగర్ రహదారి ఆటంకాలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదును హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆంజనేయనగర్ మీదుగా నిర్మాణంలో ఉన్న వైట్‌వాటర్ అపార్టుమెంట్స్ పక్కనుంచి 100 అడుగుల రహదారి ఉండగా.. దానిపై ఆటంకాలు సృష్టించడంపై స్థానికులు హైడ్రా కమిషనర్‌కు కలిసి ఫిర్యాదు చేశారు. ఆంజనేయనగర్ నుంచి ఈ దారిలో సులభంగా కూకట్‌పల్లి రోడ్డుకు చేరుకునే వెసులుబాటున్నా.. రహదారి ఆక్రమణలకు గురి కావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు.

హైటెన్షన్ వైర్లు కూడా పైనుంచి వెళ్తుండడంతో రహదారిపై ఎవరూ ఆటంకాలు సృష్టించవద్దని.. ఆక్రమణలు తొలగించి రహదారిని పునరుద్ధరించాలని హైడ్రా కమిషనర్ అధికారులును ఆదేశించారు. హైటెన్షన్ వైర్ల కింద ప్రధాన రహదారిని ఆక్రమించి బస్సుల పార్కింగ్ వినియోగించడంపై హైడ్రా కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్లి రహదారిని పునరుద్ధరించాలని ఇదే రహదారికి ఆనుకుని ఉన్న పార్కు స్థలాలను కూడా కాపాడాలని హైడ్రా కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు కమిషనర్ తిరుమల్ ఉన్నారు.

## పోలీస్ శాఖలో ప్రక్షాళన.. డీఎస్పీల పదోన్నతులపై త్వరలోనే నిర్ణయం : డీజీపీ సీవీ ఆనంద్

తెలంగాణ పోలీస్ శాఖలో పదవీ విరమణ పొందిన పలువురు విశ్రాంత అధికారుల వద్ద ఏళ్ల తరబడి విధుల్లో కొనసాగుతున్న 376 మంది పోలీసు సిబ్బందిని వెనక్కి రప్పించి, సాధారణ శాంతిభద్రతల పరిరక్షణ కోసం అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ వెల్లడించారు. సిబ్బందితో పాటు రిటైర్డ్ ఉద్యోగుల వద్ద ఉన్న 20 బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, 7 ఫార్చ్యూనర్లు, 18 ఇన్నోవా క్రిస్టాలు, మరో 58 ఇతర నాలుగు చక్రాల వాహనాలతో కలిపి మొత్తం 103 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దిని ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 90 కోట్ల మేర ప్రజాధనం ఆదా అయిందని డీజీపీ స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని డీజీపీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్టాఫ్ ఆఫీసర్ల ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఖర్చులను నియంత్రించే క్రమంలో గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌లలో పనిచేస్తున్న 573 మంది సిబ్బందికి గతంలో చెల్లిస్తున్న 60 శాతం అదనపు చెల్లింపులను ఉపసంహరించుకున్నామని డీజీపీ వివరించారు. దీనివల్ల ఏటా రూ. 28.16 కోట్ల మేర ఆదా సమకూరిందన్నారు. అలాగే గ్రేహౌండ్స్, ఎస్ఐబీ వంటి కీలక విభాగాల్లో అదనంగా ఉన్న సిబ్బందిని క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా ఇతర విభాగాల్లో వినియోగిస్తున్నట్లు చెప్పారు. శాఖలో ఎదురవుతున్న హోంగార్డుల కొరత, ప్రస్తుతం కొనసాగుతున్న పోలీసు నియామక ప్రక్రియ, ఐపీఎస్ అధికారుల నూతన అసోసియేషన్ ఏర్పాటు, కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాలు, బడ్జెట్,ఉద్యోగుల సంక్షేమ అంశాలపై ఆయన అధికారులతో సమగ్రంగా సమీక్షించారు.

పోలీసు సిబ్బంది శారీరక, మానసిక దృఢత్వాన్ని కాపాడేందుకు గతంలో హైదరాబాద్ లో అమలు చేసిన ఫిట్ కాప్ కార్యక్రమాన్ని ఇకపై రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సిబ్బందికి పూర్తి స్థాయి రక్త పరీక్షలు, థైరాయిడ్, మధుమేహం



నిర్ధారణతో పాటు సమతుల్య పోషకాహార అలవాట్లపై నిపుణులతో అవగాహన కల్పిస్తారు. ఆరోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి వైద్య సాయం అందించడం ద్వారా సిబ్బంది విధులను మరింత సమర్థంగా నిర్వర్తించగలరని డీజీపీ పేర్కొన్నారు. మరోవైపు అక్టోబర్ నెలలో తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యమివ్వనున్న దక్షిణాది రాష్ట్రాల డీజీపీల ప్రాంతీయ సదస్సు కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సదస్సులో సైబర్ నేరాలు, డ్రగ్స్ మాఫియా, వామపక్ష తీవ్రవాదం, వ్యవస్థీకృత ముఠాలు, తీరప్రాంత భద్రత, ఆధునిక నేర ధోరణులపై లోతైన చర్చలు జరగనున్నాయి.

రాష్ట్రంలో ఐజీ, ఆపై స్థాయిలో మొత్తం 48 పోస్టులు ఉండగా ప్రస్తుతం 24 పోస్టులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, డీఐజీ స్థాయిలో ఉన్న 11 పోస్టులకు తోడు భవిష్యత్తులో మరో 10 పోస్టులు వచ్చే అవకాశం ఉందని డీజీపీ తెలిపారు. 1992, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన డీఎస్పీ స్థాయి అధికారులకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే అక్టోబర్ 21న నిర్వహించే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ దుర్వినియోగం, బాలల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు.

## హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి



**అచ్చంపేట, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి)**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై వివాదాస్పద పుస్తకాన్ని రాసి విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్న హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్ట్ చేసి, ఆ పుస్తకాన్ని నిషేధించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అచ్చంపేట నుంచి హైదరాబాద్‌కు బయలుదేరుతున్న పలువురు ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో డివిజన్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పాత్కుల శ్రీశైలం, తెలంగాణ ఫ్రీడమ్ ఫైటర్ టీ జేఏసీ నాయకుడు శ్రీనివాస్, జర్నలిస్ట్ జక్క బాలకృష్ణయ్య, కొమ్ము రేణయ్య, అంజి, శివ, ఆనంద్, ప్రభాకర్, అర్జున్, పర్వతాలు, శ్యామ్, పరమేశ్వర్, రామకృష్ణ, ఇమ్మడి బాలస్వామి తదితరులు ఉన్నారు.

## రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు వేగవంతం



**టేకులపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి)**
రేషన్ డీలర్ల సంక్షేమం, హక్కుల సాధన కోసం సంఘ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఊకె శేఖర్‌రావు పిలుపునిచ్చారు. టేకులపల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు ఆంగోత్ సంతులాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి డీలర్ సంఘంలో సభ్యత్వం తీసుకుని ఐక్యంగా సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అజ్మీర రామా, గూగులోత్ చందర్, గోగ్గల కళ్యాణ్, సోలం రాంబాబు, రేషన్ డీలర్లు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతనకల్‌లో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**తల్లాడ, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, నాయుడు శ్రీనివాసరావు, శెట్టిపల్లి లక్ష్మణరావు, కళ్యాణపు కృష్ణయ్య, కళ్యాణపు వెంకటేశ్వరరావు, అడపా అనీల్, వరికొల్లి వంశీ, వైస్ సర్పంచ్ తెనాలి సత్యం తదితరులు అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ నాగుల మీరా, పసుపులేటి ప్రభాకర్, అత్తులూరి శ్రీను, తమ్మినేని పాపారావు, కళ్యాణపు మధు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

## గువ్వల రామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



**తల్లాడ, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
తల్లాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గువ్వల రామిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పార్థివ దేహానికి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని, తల్లాడ మండలం ఓ సీనియర్ నాయకుడిని కోల్పోయిందని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, కార్యదర్శి మర్ధకట్ల బాబు, వైరా మాజీ మార్కెట్ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు వచ్చే ఏప్రిల్ నెలాఖరు కల్లా పుష్కరాల పనులు పూర్తి చేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన 'గోదావరి పుష్కరాలు – 2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పుష్కరాల ఏర్పాట్లపై సమీక్షించారు.

## విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన

### చిలుకూరు సబ్‌స్టేషన్ ముట్టడి.. హైవేపై రాస్తారోకో



**చిలుకూరు, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
విద్యుత్ కోతలను నిరసిస్తూ చిలుకూరు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించారు. 24 గంటల విద్యుత్ ఇస్తామని చెప్పి కనీసం 8--12 గంటలు కూడా సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ హుజూర్‌నగర్--కోదాడ హైవేపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు, విద్యుత్ అధికారులు రైతులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు. రెండు మూడు రోజుల్లో కొండాపురం సబ్‌స్టేషన్ ప్రారంభించి, కొండాపురం ఫీడర్‌కు అక్కడి నుంచే విద్యుత్ సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిలుకూరు, కొండాపురం, ఆర్‌సీ నగర్ ఫీడర్ల రైతులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కుటుంబ భూదోపిడిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

### మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేణికుంట్ల అశోక్



**హసన్‌పర్తి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కుటుంబ సభ్యులు, వారి అనుచరులు భూ అక్రమాలకు పాల్పడ్డారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేణికుంట్ల అశోక్ ఆరోపించారు. ఎర్రగట్టుగుట్టలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్రవల్లి, మర్కుక్ ప్రాంతాల్లో అసైన్డ్, ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములపై అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో జరిగిన భూ మార్పులపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలను గుర్తించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబం, బినామీల పేర్లపై ఉన్న భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ సమావేశంలో పోరెడ్డి మహేందర్ రెడ్డి, తంగళ్ళపల్లి తిరుపతి, అరెల్లి వెంకటస్వామి, పోరిక పూల, బత్తుల స్వాతి, జన్ను అశోక్ యూత్ కాంగ్రెస్, ఎస్సీ, బీసీ, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్ధ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవం



**వనపర్తి : సెప్టెంబర్ 18, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా నిస్వార్ధ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో వెదురు మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా వెదురు వల్ల ఉపయోగాలు విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలుర పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,నిస్వార్ధ ఆర్గనైజేషన్ సభ్యులు, కొల్లాపూర్ ఎంఎస్డబ్ల్యూ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఎస్సీ సర్టిఫికెట్లపై సమగ్ర విచారణకు డిమాండ్

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం



**వనపర్తి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
ఆత్మకూరు మండలంలో నకిలీ ఎస్సీ కుల ధృవీకరణ పత్రాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని సీనియర్ జర్నలిస్ట్ కాడేపాగు అశోక్, డీజేఎఫ్ (డబ్ల్యూ) జిల్లా అధ్యక్షుడు గంధం రవికుమార్ డిమాండ్ చేశారు. వనపర్తి ఐడీఓసీలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీల సమస్యల సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. బీసీ–బీ కేటగిరీకి చెందిన కొందరు నకిలీ ఎస్సీ సర్టిఫికెట్లతో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ప్రయోజనాలు పొందుతున్నారనే ఆరోపణలపై పాత రికార్డులను పరిశీలించి విచారణ చేపట్టాలని కోరారు. నకిలీ సర్టిఫికెట్లు తేలితే రద్దు చేసి, అర్హులైన దళితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన చైర్మన్ బక్కి వెంకటయ్య సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు కాడేపాగు అశోక్,వనపర్తి డిజెఎఫ్( డబ్ల్యూ) జిల్లా అధ్యక్షుడు గంధం రవికుమార్ తెలిపారు.

## యూపీఐ చార్జీల నుంచి వ్యవసాయ డీలర్లకు మినహాయింపు ఇవ్వాలి



### రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు

**వరంగల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయాలకు సంబంధించిన యూపీఐ లావాదేవీలపై డీలర్లకు చార్జీల నుంచి మినహాయింపు లేదా రాయితీ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్న నేపథ్యంలో డీలర్లపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రభుత్వం బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలతో సమన్వయం చేసి ప్రత్యేక రాయితీ విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# మెదక్ టూరిజంపై ప్రత్యేక దృష్టి

**మెదక్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మెదక్ జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు తుది మెరుగులు దిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రెండో విడత జిల్లా టూరిజం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు.
ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంతో పాటు మెదక్ కోటలో పర్యాటక ప్రాంతాల సందర్శనకు టికెటింగ్ వ్యవస్థను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మెట్లబావి, వెల్దుర్తి తోరణం తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు హోమ్‌స్టేలు, టూరిస్ట్ గైడ్లు, భద్రతా సిబ్బంది, హౌస్‌కీపింగ్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. సోషల్ మీడియా వినియోగదారులు మెదక్ పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా ప్రచారం చేసేలా భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో గూగుల్ మీట్ ద్వారా టూరిజం



డైరెక్టర్ రంజిత్ నాయక్, ఆర్కియాలజీ అండ్ హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు, టూరిజం కార్పొరేషన్ రామకృష్ణ, డీఈ శ్రీశైలం, డెక్కన్ టెరైన్ కన్సల్టెన్సీ ప్రతినిధి మీర్ ఖాన్ పాల్గొన్నారు. జిల్లా టూరిజం అభివృద్ధి అధికారి ఎల్లయ్య, డీఎఫ్ఓ జోజి, డీపీఆర్ఓ రామచంద్రరాజు, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు, ఈడీఎం సందీప్, మున్సిపల్ కమిషనర్ నవీన్ తదితరులు హాజరయ్యారు.

# పోషకాహారంపై విస్తృత అవగాహన కల్పించాలి

**పెద్దపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. పోషణ మాసం--2026లో భాగంగా శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో పోషణ్ మహా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సీడీపీఓ అనిత, రామ



గుండం సీడీపీఓ అలేఖ్య పటేల్, మంథని ఇన్‌చార్జి సీడీపీఓ పుష్పలత, జిల్లా సంక్షేమ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, బ్లాక్ కోఆర్డినేటర్లు కుమార్, హసీబ్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



## తండాలో వెల్లివిరుస్తున్న భక్తిభావం

**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి)**
పెద్ద శంకరంపేట సమీపంలోని రాఘవాని తండాలో గిరిజనులు భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, వివిధ రకాల నైవేద్యాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని రాష్ట్ర డీడీఎన్ అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్రశేఖర్ తెలిపారు.

## గణేష్ వర్తక సంఘం ఆధ్వర్యంలో కుంకుమ పూజ, మహా అన్నదానం



**చిట్యాల, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మండల కేంద్రంలో గణేష్ వర్తక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వ హించారు. మహిళలు, దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించి సుమారు 1,000 మందికి అన్నప్రసాదం అందించినట్లు సంఘం అధ్యక్షుడు గుర్రపు తిరుపతి గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి చిలగాని నాగరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సామల రమేష్, ప్రధాన కార్యదర్శి బుర్ర సురేష్, కోశాధికారి మైదం శ్రీకాంత్, కమిటీ సభ్యులు క్యాతం రమేష్, చింతకింది దశరథం, చింతల రాజేందర్, కేంసారపు ప్రభాకర్, క్యాతరాజు మల్లేష్, వీణవంక శ్రీదేవి, చిలుముల రాజేందర్, మాడిశెట్టి తిరుపతి, వల్లాల ప్రవీణ్, ఉయ్యాల రమేష్, సరిగొమ్ముల రాజేందర్, తాటిపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు..

## తండ్రి మందలించడంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కళాశాలకు సక్రమంగా వెళ్లడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ ఇంటర్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఆకునూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకునూరు గ్రామానికి చెందిన బొజ్జ హర్షవర్ధన్ (17) సోమారం ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే, గత కొంత కాలంగా హర్షవర్ధన్ కళాశాలకు సక్రమంగా వెళ్లక పోవడంతో తండ్రి మందలించాడు.

## కమిషనరేట్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేక పూజలు నిర్వ హించారు. గణేష్ ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించి శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గునుకులపల్లి--చిగురుమామిడి రోడ్డు మార్గం పరిశీలన



**చిగురుమామిడి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
గునుకులపల్లి--చిగురుమామిడి మధ్య నిర్మించనున్న 7.5 కి.మీ. రోడ్డు మార్గాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఆర్డీఓ షర్మిలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. 6.5 కి.మీ. రోడ్డు నిర్మాణానికి హ్యామ్ పథకం కింద నిధులు మంజూరై టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన కిలోమీటర్‌కు నిధుల కోసం ప్రతిపాదనలు త్వరగా పంపాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు పూర్తయితే పలు గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రయాణ సమయం, దూరం తగ్గుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో సర్పంచ్ గురుకుల మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ వెంట డీపీఆర్ఈ జనార్ధన్, పీఆర్ ఏఈ నిరంజన్ రెడ్డి,ఆర్ఐ చిర్ర నాగరాజు, ఉపసర్పంచ్ గునుకుల లతఅశోక్ రెడ్డి, స్థానిక రెవెన్యూ,ఇంజనీరింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దీపాల వెలుగులో మోదీ చిత్రపటం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
బీజేపీ మహిళా నేత కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని దీపాలతో రూపొందించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వికసిత్ భారత్ లక్ష్యాలు, దేశ ప్రగతి, ప్రజా సంక్షేమంపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. దేశ ఆర్థికాభివృద్ధి, యువతకు ఉపాధి, మహిళా సాధికారత, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సంధ్యారాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, బీజేపీ లేబర్ సెల్ జిల్లా కన్వీనర్ తడగొండ నరసయ్య, జక్కుల పద్మ, ప్రవీణ్, బియ్యాల మహేందర్, ఆలయ పూజారి మురళి, లింగమూర్తి, ప్రతాపరెడ్డి, సంజీవ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## అన్నమాచార్య కీర్తనలతో అలరించిన రవీంద్రబాబు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
మైత్రినగర్ మదీనాగూడలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో రవీంద్రబాబు అరవా నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. వాద్య సహకారంతో ఆయన ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను అలరించాయి. కార్యక్రమానికి ముందు రవీంద్రబాబు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఆయనను సత్కరించి మరోసారి సంగీత కార్యక్రమం నిర్వహించాలని కోరారు. సాహితీవేత్తగా, గాయకుడిగా, నటుడిగా కొనసాగు తున్నందుకు ఆనందంగా ఉందని రవీంద్రబాబు తెలిపారు. పదవీ విరమణ అనంతరం సాహితీ, కళారంగ ప్రముఖులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని విజయవంతం చేద్దాం

**హుస్నాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ఆర్.సి)**



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 21న హైదరాబాద్ జలదృశ్యంలో నిర్వహించే కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వలస సుభాష్ చంద్రబోస్ నేత పిలుపునిచ్చారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో బాపూజీ కీలక పాత్ర పోషించారని, తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. యువత ఆయన ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వర్ధంతి కార్యక్ర మానికి బాపూజీ అభిమానులు, తెలంగాణ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై ఘన నివాళులర్పించాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా వినాయక పూజలు.. అన్నదానం



**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిది**
.) జమ్మికుంట పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 13వ వార్డు ఆబాది జమ్మికుంట మహా గణపతి వద్ద కురుమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంతో ఆబాది జమ్మికుంట ప్రాంతం సందడిగా మారింది.

## వినాయకుడికి బండి సంజయ్ ప్రత్యేక పూజలు



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ అశోక్‌నగర్‌లోని వినాయక మండపాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై.సునీల్‌రావు కూడా పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు వారిని సన్మానించారు.

## సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**పెద్దపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
సింగరేణి కార్మికుల సమస్యలను ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ కోరారు. శుక్రవారం అసెంబ్లీలో సింగరేణి సమస్యలను ప్రస్తావిస్తూ 76 జీఓ అమలు చేసి కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, మారు పేర్ల సమస్యను పరిష్కరించి అర్హులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్ల స్థానంలో సొంతింటి నిర్మాణానికి స్థలం, రుణ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆర్అండ్‌బీ రోడ్ల పనులు, హైపవర్ కమిటీ ప్రక్రియను పూర్తి చేసి, 1ఐ800 మెగావాట్ల సింగరేణి విద్యుత్ ప్లాంట్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు.

## త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
మోహన్‌రావుపేట గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు భక్తులకు స్టీల్ ప్లేట్లను అందుబాటులోకి తెచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామస్థుల సహకారంతో స్టీల్ ప్లేట్లు సమకూర్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిశూల్ కమిటీ సభ్యులు, కమిటీ సభ్యులు, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి పద్మాదేవేందర్ రెడ్డి భరోసా

### రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం



**నర్సింగి : సెప్టెంబర్ 18(తెలంగాణ వాణి ప్రతినిధి)**
నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన ఇండ్ల సత్యం రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో బాధిత కుటుంబానికి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి అండగా నిలిచారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి కష్టకాలంలో తమ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.ఆర్థిక సహాయం అందజేసిన వారిలో పార్టీ మండల నాయకులు బండారు గొండ స్వామి యాదవ్, ఉపసర్పంచ్ విజయ్ కుమార్, వార్డు సభ్యులు కందర్ శ్రీనివాస్, చింతల మల్లేశం, పార్టీ నాయకులు ఇండ్ల శ్రీనివాస్, బోయిని రమేష్, సింగం యాదగిరి, నేరెళ్ల రాజేశ్వర్, కుంటల లచ్చయ్య, చరకం యాదగిరి, జంగం స్వామి, చెప్పాల రమేష్, మేకల శ్రీనివాస్, తాళ్ల రవీందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## కమిటీల పేరుతో కాలయాపన వద్దు



**కరీంనగర్‌టౌన్, సెప్టెంబరు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఉద్యోగుల సమస్యలపై కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే నిర్ణయాలు తీసుకోవాలని టీఎన్‌జీవోల జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, టీజీవోల జిల్లా అధ్యక్షుడు, జేఏసీ కన్వీనర్ మడిపెల్లి కాళీచరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని టీఎన్‌జీవోల సంఘ భవన్‌లో టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. పీఆర్‌సీ ప్రకటించి అమలు చేయడంతో పాటు పెండింగ్ డీఏలు, ఈహెచ్ఎస్, జీపీఎఫ్, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని కోరారు. స్పష్టమైన కాలపరిమితితో సమస్యలు పరిష్కరించకుంటే ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో టీఎన్‌జీవోల జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణ్‌రావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కార్యదర్శి డాక్టర్ అరవింద్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు గూడ ప్రభాకర్‌రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు ఇరుమల్ల శారద, వివిధ సంఘాల అధ్యక్షులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గతం కంటే ఘనంగా గణేశ్ నిమజ్జన ఉత్సవాలకు ఏర్పాట్లు



**కరీంనగర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కరీంనగర్‌లో గణేశ్ నిమజ్జన ఉత్సవాలను గతం కంటే ఘనంగా నిర్వహించేందుకు రూ.1.50 కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నట్లు మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్‌రావులతో కలిసి పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన కూడళ్లలో లైటింగ్, అలంకరణలు, మంచినీరు, ప్రసాదాల ఏర్పాట్లు చేయడంతో పాటు నిమజ్జన వాహనాలకు ఇబ్బందులు లేకుండా రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రశాంతమైన, ఆధ్యాత్మిక వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు.

## నాయిని చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



జమ్మికుంటలో గణేష్ నిమజ్జనం కోసం నాయిని చెరువు వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ గౌస్ అలాం పరిశీ లించారు. నిమజ్జనాన్ని సురక్షితంగా, వేగంగా నిర్వహిం చేందుకు మూడు క్రేన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించ నున్నట్లు అధికారులు తెలిపారు. పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, ఏసీపీ మాధవి, సీఐ రామకృష్ణ గౌడ్, ఎస్ఐలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్పష్టమైన లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలి: సీపీ గౌస్ ఆలం



**శంకరపట్నం, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం ఐపీఎస్ సూచించారు. మెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "పోలీసులు మీకోసం" కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు గోల్ కార్డులు, ఫోటో ఫ్రేమ్‌లు, క్రీడా సామగ్రి అందజేశారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం మెట్‌పల్లిలో సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను ప్రారంభించి, మొక్క నాటారు. గ్రామపంచాయతీ కార్మికులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, ఎస్సై కె.శేఖర్, ఎంఈఓ లక్ష్మీనారాయణ, సర్పంచ్ కొయ్యడ కుమార్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కేశవపట్నం పరిధిలోని గణేష్ మండపాలను సీపీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాహకులు ఎలక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు.





## గోపాల్‌పేట్ మోడల్ స్కూల్‌లో యూనిఫాంల పంపిణీ

**నాగిరెడ్డిపేట్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గోపాల్‌పేట్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన కొత్త యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకట్‌రెడ్డి విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి పంచాయతీ తరఫున పూర్తి సహకారం అంది స్తామని సర్పంచ్ వంశీకృష్ణగౌడ్ తెలిపారు. బాలికల హాస్టల్ విద్యార్థినులకు కాలేజ్ బ్యాగులు, బూట్లు, సాక్సులు, స్టీల్ సామగ్రిని పంపిణీ చేశారు. మోడల్ స్కూల్స్ ప్రారంభమైన 14 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది 780 మంది విద్యా ర్థులు చేరడం రికార్డని ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ఫౌజియా బేగం, కేర్‌టేకర్ నిర్మల, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మారెడ్డిలో ఆరోగ్య శిబిరం




**నాగిరెడ్డిపేట్, సెప్టెంబర్ 18:(తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట్ మండలం ధర్మారెడ్డి గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం జంకంపల్లి ఏఎన్ఎం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రబలే జ్వరం, జలుబు, దగ్గు, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోగులకు సురక్షిత వైద్యం అందించడమే లక్ష్యం



**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పేషంట్ సేఫ్టీ డే సందర్భంగా జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో వావిలాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చందన ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హుజురాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభుదాస్ మాట్లాడుతూ ప్రతి రోగికి సురక్షిత, నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్నారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు.వడ్డెర కాలనీలో డ్రై డే ఫ్రైడే, డ్రై డే ట్యూస్‌డేపై అవగాహన కల్పించి, నీరు నిల్వ లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సదానందం, శరత్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్‌గౌడ్, సబ్‌యూనిట్ ఆఫీసర్ రాజేందర్‌రాజు, సాజిదా పర్వీన్, నరేందర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పని భారం తగ్గించాలి.. గేట్‌పాస్‌లు ఇవ్వాలి

### అధికారుల వేధింపులు ఆపాలని సింగరేణి సెంట్రల్ వర్క్‌షాప్ కార్మికుల మెరుపు సమ్మె



**కొత్తగూడెం, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి)**
సింగరేణి సెంట్రల్ వర్క్‌షాప్‌లో కార్మికులు శుక్రవారం సాయంత్రం మెరుపు సమ్మెకు దిగారు. పని భారం తగ్గించాలని, గేట్‌పాస్‌లు ఇవ్వాలని, అధికారుల వేధింపులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ సుమారు 3 గంటల పాటు వర్క్ షాప్ గేటు మూసివేసి నిరసన తెలిపారు. కార్మికులపై పెరుగుతున్న పని ఒత్తిడితో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తమ సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గేట్‌పాస్‌ల విషయంలో ముఖ్యంగా గత 40 ఏళ్ల నుండి లేని నూతన షరతులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని, విధి నిర్వహణలో అధికారుల నుంచి అనవసర ఒత్తిడి, వేధింపులు తగ్గించాలని కోరారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి పని వాతావరణాన్ని మెరుగుపరచాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మూడు గంటల పాటు కొనసాగిన నిరసనతో సెంట్రల్ వర్క్‌షాప్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడింది.

## ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం ముందస్తు చర్యలు

**పెద్దపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పలు ముందస్తు చర్యలు చేపడుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. రైతులకు శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉండటంతో వర్షపాతం లోటు, పొడి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. రైతాంగానికి ఎస్సారెస్పీ ద్వారానే సాగునీరు అందుతోందని తెలిపారు.కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి నుంచి ప్రాణహిత–చేవెళ్ల వరకు ప్రాజెక్టుల రూపకల్పన జరిగిందని, బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అబద్ధాలు చెబుతున్నారని విజయరమణ రావు విమర్శించారు.

## ఘనంగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తహ



**నారాయణఖేడ్ :సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నారాయణఖేడ్ మండల ప్రాంతంలోని సంజీవన్ రావుపేట్ గ్రామం లోని శ్రీ అనంతశయన గణేష్ మండలి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి దేవాలయంలో శ్రీ గణేష్ ఉత్సవ అఖండ హరినామ సప్తహ భాగంలో మొదటిరోజు గురువర్యులు శ్రీ కరణ్ గజేంద్ర భారతి మహారాజు గారిచే సప్త పూజ కార్యక్రమం చేసి సప్త ప్రారంభించడం జరిగింది మొదటి రోజు కీర్తన సేవ రంగ వైభవంగా హరి భక్త పారాయణ్ జ్ఞానేశ్వర్ మహారాజ్ అంతర్గాం గారిచే నిర్వహించబడింది అదేవిధంగా రెండో రోజు కీర్తన సేవా భాగంలో హనుమాన్లు మహారాజ్ బండా రంజల్ గారిచే నిర్వహించను బడింది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు భజన మండలి వార్కారి సాంప్రదాయంతో రంగ వైభవంగా కీర్తన సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అదేవిధంగా అన్నదాన ప్రసాదం కార్యక్రమం నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో శ్రీ అనంతశయన గణేష్ ముస్తవ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది .

## వేగంగా విద్యుత్ బిల్లుల చెల్లింపు

**పెద్దపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**



డిజిటల్ విధానాల ద్వారా విద్యుత్ బిల్లులను సులభంగా, వేగంగా చెల్లించవచ్చని పెద్దపల్లి సర్కిల్ ఎస్ఈ వి. గంగాధర్ తెలిపారు. గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం, భీమ్, బ్యాంకింగ్ యాప్‌లు, టీజీఎన్‌పీడీసీఎల్ యాప్ ద్వారా బిల్లులు చెల్లించ వచ్చన్నారు. పెద్దపల్లి సర్కిల్‌లో ఆన్‌లైన్ చెల్లింపులు 2024--25లో 5,94,603 నుంచి 2025--26లో 7,12,017కు పెరిగాయని తెలిపారు. డిజిటల్ చెల్లింపులతో సమయం, శ్రమ, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని, వినియోగదారులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రోడ్డు పూర్తికాకుంటే దీక్షకు దిగుతా: ఎమ్మెల్యే కవ్వంపల్లి

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



గుండ్లపల్లి--పొత్తూర్ రహదారి నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హెచ్చ రించారు. శుక్రవారం అసెంబ్లీలో నియోజకవర్గ రహదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టర్‌కు పాత బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. బిల్లులు వెంటనే చెల్లించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇచ్చిన హామీ మేరకు రోడ్డు పూర్తయ్యే వరకు పోరాడతానని స్పష్టం చేశారు.

## వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027 పోస్టర్‌ను ఆవిష్కరించారు. 15 నుంచి 29 ఏళ్ల యువత తమ ఆలోచనలు, సృజనాత్మకతను దేశ నిర్మాణంలో భాగస్వామ్యం చేసుకునేందుకు ఈ కార్యక్రమం అవకాశం కల్పిస్తుందని తెలిపారు. యువత మైభారత్ పోర్టల్‌లో సెప్టెంబర్ 30లోగా నమోదు చేసుకోవాలని, తెలంగాణ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కళాశాలల యాజమాన్యాలు రిజిస్ట్రేషన్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా యువజన అధికారి గోలి తిరుపతిరెడ్డి, కార్యక్రమ అధికారి జి.కిరణ్‌కుమార్, మైభారత్ వాలంటీర్ బకారం అక్షయ్ పాల్గొన్నారు.

## నవయుగ యూత్ ఆధ్వర్యంలో కుంకుమార్చన



**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
చిన్నమెట్‌పల్లి గ్రామంలో నవయుగ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన, దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నవ యుగ యూత్ సభ్యులు మోహన్‌రెడ్డి, జగదీష్, మహిపాల్, రాజు, సతీష్, రమేష్, విజయ్, సురేష్, రాజేష్, జీవన్‌తో పాటు మహిళలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## పిల్లల ఎదుగుదలకు పోషకా ఆహారం తీసుకోవాలి

### సర్పంచ్ జంగ శిరీష



**చిగురుమామిడి సెప్టెంబర్ 18 ( తెలంగాణ వాణి విలేఖరి )**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం,సుందరగిరి అంగన్వాడి కేంద్రాలలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది జంగా శిరీష సర్పంచ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే పదార్థాల గురించి ,ప్లాస్టిక్ నిషేధం గురించి , చిన్నపిల్లలకి మొబైల్ వాడకూడదని తల్లులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అన్నప్రాసన నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి,సూపర్వైజర్ ఇస్రత్ సుల్తానా అంగన్వాడీ టీచర్స్ శోభ ,రాజమణి, తల్లులు, పిల్లలు ,కిశోర బాలికలు, వార్డ్ మెంబర్స్ ,వివోలు, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో ఘనంగా పెరియార్ 147వ జయంతి



**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
పెరియార్ ఈవీ రామసామి 147వ జయంతిని పురస్కరించుకుని జమ్మికుంటలో ప్రజా సంఘాలు, మేధావుల ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. సహచర హాస్పిటల్‌లో పెరియార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం, మహిళా విముక్తి, కులవ్యవస్థ వ్యతిరేక పోరాటాల్లో పెరియార్ చేసిన కృషిని వక్తలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్. తిరుపతయ్య, విద్యావేత్త డాక్టర్ పుల్లూరి సంపత్, ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపకులు రామంచ భరత్, బీఎస్పీ సీనియర్ నాయకులు మారేపల్లి మొగిలయ్య, డాక్టర్ అంబాల ప్రభాకర్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు ఎస్. అచ్యుత్‌కుమార్, ఉపాధ్యాయులు ఆవాల నరహరి, మారముల ప్రభు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## గణిత శాస్త్రంలో కందుల రజనికి పీహెచ్.డీ

**పటాన్ చెరు, సెప్టెంబర్ 18, (తెలంగాణ వాణి)**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కందుల రజని డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సమీప బీజగణితాలలో రఫ్ సెట్ల సిద్ధాంతానికి చేసిన కృషి'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. నరసింహస్వామి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. అనిశ్చితి, అసంపూర్ణ సమాచారాన్ని పరిష్కరించడంలో, డాక్టర్ రజని పరిశోధన రఫ్ సెట్ సిద్ధాంతం, సమీజ బీజగణిత నిర్మాణాల అధ్యయనాన్ని ముందుకు తీసుకువెళ్తుందని తెలియజేశారు. ఆమె కృషి రఫ్ సమీప బీజగణితాల భావనను పరిచయం చేస్తుందని, రఫ్ ఐడియల్స్, రఫ్ సబ్ స్ట్రక్చర్లు, వాటి బీజగణిత ధర్మాలు, పరస్పర సంబంధాలను పరిశీలిస్తుందని వివరించారు. ఇది అనిశ్చితిలో బీజగణిత నిర్మాణాలను అన్వేషించడానికి ఒక చట్రాన్ని అందిస్తుందన్నారు. ఆమె చేసిన గణనీయమైన పరిశోధన కృషి, ఆమె అకడమిక్ నైపుణ్యాన్ని, గణిత పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలనే ఆమె నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. దీనిని అనుబంధ రంగాలలో కూడా వినియోగించే అవకాశం ఉందన్నారు. డాక్టర్ రజని సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

## వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు లక్ష్యం



**కరీంనగర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లాలో ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఉద్యానవన, వ్యవసాయ శాఖలు సమన్వయంతో గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఏఈవోకు 25 ఎకరాల చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో ప్రత్యేక కార్యాచరణతో ఒక్కో మండలంలో 50 ఎకరాల్లో సాగు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిగురుమామిడిలో సుమారు 25 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ నర్సరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆయిల్‌ఫామ్ సాగుతో మెరుగైన ఆదాయం పొందే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



**కరీంనగర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేసి, 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని, ఈహెచ్‌ఎస్‌ను సమర్థంగా అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, జీఓ 317 బాధితులను సొంత జిల్లాలకు సర్దుబాటు చేయాలని, పెండింగ్ బిల్లులు, ప్రమోషన్లు, సర్వీస్ ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో తగినంత ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్, బకాయిలను సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పోరాటాలకు తెలంగాణ రక్షణ సేన సంపూర్ణ మద్దతు ఇస్తుందని హరిప్రసాద్ తెలిపారు.

## ఉపాధ్యాయుల ఐక్యతకు కొత్త ఊపిరి




**కంగ్టి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి**
) కంగ్టి మండల పీఆర్టీయూ సర్వసభ్య సమావేశం తడ్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన మండల కార్యవర్గాన్ని సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ అభివృద్ధి, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణపై చర్చించారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే నూతన కార్యవర్గం ప్రధాన లక్ష్యమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మానయ్య తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ ఉపాధ్యాయుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## రాజన్న దయతో ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలి



**వేములవాడ, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి శ్రీ భీమేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆది శ్రీనివాస్ పేరిట అర్చనలు నిర్వహించి భక్తులు, నిరుపేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ. 1,000 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆది శ్రీనివాస్ సేవలను గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు త్వరలో రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు. అనంతరం తెలంగాణ చౌక్‌లో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి పట్టకుండా చూడాలి

**వనపర్తి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. శుక్రవారం వనపర్తి కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవించి, వారి సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను వేగంగా పరిష్కరించాలని, బాధితులకు పరిహారం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందించాలని కోరారు. రిజర్వేషన్లు, రోస్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి నెల సివిల్ రైట్స్ డే, మూడు



నెలలకు ఒకసారి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో కమిషన్ సభ్యులు లక్ష్మణ్, రాంబాబు నాయక్, అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీ రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సిరాజుద్దీన్, సామాజికవేత్త గంధం నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## బీమాక్ కాలనీలో మహిళలకు కుంకుమ అర్చన పూజ

**తెల్లాపూర్ సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి**
వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం బీమాక్ కాలనీలో మహిళలకు ప్రత్యేకంగా కుంకుమ అర్చన పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, భక్తి పాటలు మరియు పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు, కుటుంబ సభ్యులు పాల్గొని వినాయకుడి ఆశీస్సులు పొందారు.

## సైబర్ సిటీ అపార్ట్‌మెంట్స్‌లో ఘనంగా కుంకుమ అర్చన పూజ-



**తెల్లాపూర్ సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సైబర్ సిటీ అపార్ట్‌మెంట్స్‌లో ఆరో రోజు శుక్రవారం మహిళలకు ప్రత్యేకంగా కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అపార్ట్‌మెంట్స్‌లోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం మహిళలకు కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని భక్తి పాటలు, పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం మహిళల్లో భక్తి, ఐక్యతను చాటిచెప్పింది. అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు మరియు కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే



**నారాయణఖేడ్: పెద్దశంకరంపేట్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
శంకరంపేట్(ఏ ) మండలం గోపని వెంకటపురం గ్రామానికి చెందిన సునీత ఆసుపత్రి వైద్య ఖర్చుల కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 7000 రూపాయల చెక్కును లబ్ధిదారులకు అందజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి, వారితోపాటు సర్పంచులు సాయిలు,కోణం అంజయ్య, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి,సాయిలు,దమ్ము నాగయ్య,దమ్ము మల్లయ్యా, ఎల్లయ్య, ప్రశాంత్ సాగర్ తదితరులు ఉన్నారు.

## 50కి పైగా కంపెనీలు.. 3,000కు పైగా ఉద్యోగావకాశాలు




**చౌటుప్పల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
మునుగోడు నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 27న తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆసరా ఫౌండేషన్ చైర్మన్ బొల్ల శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ మేళా పోస్టర్‌ను చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మథ కుమార్ ఆవిష్కరించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే మేళాలో 50కి పైగా కంపెనీలు పాల్గొని 3,000కు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఐటీ, బీపీఓ, తయారీ, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, రిటైల్, మార్కెటింగ్ రంగాల్లో అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు దోర్నాల గజేందర్, సంగిశెట్టి ధనుంజయ్, సిలివేరు విజయ్, సింగం కృష్ణ, చామల చింటూ, సిలివేరు ప్రభాస్, గంజి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మల్కాపూర్‌లో పోషకాహార వారోత్సవాలు



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మల్కాపూర్ గ్రామ అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మతమాల సెక్టార్ పరిధిలోని రుద్రారం, అల్మాజీపూర్, మతమాల, జంగమ్మాయిపల్లి, బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది గర్భిణులు, బాలింతలు, తల్లులు, 0--6 ఏళ్ల పిల్లలకు పౌష్టికాహారం, 'థౌజండ్ గోల్డెన్ డేస్' ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మతమాల సెక్టార్ సూపర్‌వైజర్ స్వప్న, మల్కాపూర్ సర్పంచ్ కొండ యోగితా మధు పాల్గొని పోషకాహారం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు.

## గంజాయి విక్రేత అరెస్ట్..

శంకర్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'నషా ముక్త్ తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లి పోలీసులు డ్రగ్స్ విక్రయం, సరఫరా, వినియోగంపై చర్యలను ముమ్మరం చేశారు. ఇటీవల రెండు వేర్వేరు కేసుల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన షేక్ అరిఫుల్ (24)ను 600 గ్రాముల గంజాయితో పట్టుకుని అరెస్ట్ చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఐదుగురిని డ్రగ్స్ వినియోగదారులుగా గుర్తించారు. వైద్య పరీక్షలు, అవసరమైన ధ్రువీకరణ, వారి సమ్మతి, కోర్టు ఆదేశాల అనంతరం వారిని కౌన్సెలింగ్, చికిత్స, పునరావాసం కోసం డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించారు. శంకర్‌పల్లి ఇన్‌స్పెక్టర్ రుద్వీర్ కుమార్ మాట్లాడుతూ.. డ్రగ్స్ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతోందని తెలిపారు. డ్రగ్స్ విక్రయించే పెడ్లర్లు, సరఫరాదారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.



## అన్నమాచార్య కీర్తనలతో అలరించిన రవీంద్రబాబు అరవా

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
మైత్రినగర్ మదీనాగూడలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో రవీంద్రబాబు అరవా నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. వాద్య సహకారంతో ఆయన ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం రవీంద్రబాబు దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు రవీంద్రబాబు దంపతులను సన్మానించి మరోసారి కార్యక్రమం నిర్వహించాలని కోరారు. సాహితీవేత్తగా, గాయకుడిగా, నటుడిగా కొనసాగడం ఆనందంగా ఉందని రవీంద్రబాబు తెలిపారు. పలువురు సాహితీవేత్తలు, గాయనీగాయకులు, కళాకారులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## ఎమ్మెల్సీ అంజిరెడ్డి చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్ గ్రామానికి చెందిన బుజ్జం రాములుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 28,500 చెక్కును బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రత్యేక చొరవతో చెక్కు మంజూరైనట్లు తెలిపారు. సహాయానికి కృషి చేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డికి రాములు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దశరథ్, మాజీ సర్పంచ్ ఎంబరి విఠల్, మండల ప్రధాన కార్యదర్శి కానికేందర్, బీజేవైఎం నాగ్దర్ సాయి, యాదగౌడ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా అనంతుల రమేష్



**కరీంనగర్, సెప్టెంబర్ 18(తెలంగాణ వాణి)**
కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా అనంతుల రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావును రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెటుకుంటూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రమేష్ తెలిపారు.

## సామాజిక వివక్షపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి



**వనపర్తి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వనపర్తి జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అన్యాయాలు, దాడులు, కుల వివక్షపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా బృందం రాష్ట్ర ఎస్సీ--ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేసింది. పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులను వేగంగా పరిష్కరించి, బాధితులకు చట్టప్రకారం పరిహారం, రక్షణ, పునరావాసం కల్పించాలని కోరారు. ప్రతి మండలంలో సామాజిక వివక్షపై ప్రత్యేక తనిఖీలు, ప్రజా విచారణలు నిర్వహించాలని, పోలీసు, రెవెన్యూ అధికారులకు ఎస్సీ--ఎస్టీ చట్టంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్థాయిలో కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, జిల్లాలో నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా ఇన్‌చార్జి కొమ్మువారి మస్తాన్ మాదిగ, జిల్లా నాయకులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ, మీసాల నాగరాజు మాదిగ, మచ్చ తిరుపతి మాదిగ, పుట్టపాగు అజయ్ మాదిగ, రవివర్మ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ యూత్ ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామంలో లయన్స్ యూత్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 15 ఏళ్లుగా తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు, భజనలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానం మహాదానమని, ప్రతి ఒక్కరూ సేవాభావంతో ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. అన్నప్రసాద వితరణకు వారికాడి చంద్రకాంత్‌రావు దాతగా వ్యవహరించారు. గణనాథుని కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని లయన్స్ యూత్ సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకలు



**నిజామాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిజామాబాద్ హనుమాన్ జంక్షన్ సమీపంలోని మహనీయుల పార్క్‌లో ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) భుజంగరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెదురు ఉత్పత్తులు, మేదర వృత్తి ప్రాధాన్యత, వృత్తిదారుల సంక్షేమంపై అవగాహన కల్పించారు. వెదురు ఆధారిత వృత్తిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భుజంగరావు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి వెదురు వస్తువులను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో దర్శనం దేవేందర్, సురునీడ పోషాద్రి, బుస్స ఆంజనేయులు, నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఏ దశలోనూ ఇబ్బందులు తలెత్తకూడదు




**నిజామాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సన్నాహక సమావేశం, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు, తేమ కొలిచే యంత్రాలు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, తూకం, తరుగు విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోడౌన్లకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సమావేశంలో డీఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, ఏఎస్ఓ అరవింద్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి గంగుబాయి, తూనికలు కొలతల అధికారి షుజాత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## బంజారా జాతి అభ్యున్నతికి కలిసికట్టుగా పోరాడుదాం



**నిజామాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
బంజారా జాతి అభ్యున్నతికి ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని గిరిజన నేత, మాజీ మంత్రి రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం నిజామాబాద్ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారాలు ఎస్టీలుగా గుర్తింపు పొంది 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. మైదాన ప్రాంత గిరిజనులకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని, తండాలను గిరిజన రెవెన్యూ తండాలుగా మార్చి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. బంజారా జాతికి ఘనమైన చరిత్ర ఉందని, అభివృద్ధిలో మరింత ముందుకు సాగేందుకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బంజారా ప్రతినిధులు శివలాల్ బాబురావు, డాక్టర్ బిలోజి నాయక్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ శిశు మందిర్‌లో నిమజ్జన వేడుకలు



**నిర్మల్ - భైంసా: సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భైంసా పట్టణంలోని పులే నగర్‌లో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో గణేష్ నిమజ్జన వేడుకలు విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిమజ్జనోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేస్తూ వేడుకల్లో సందడి చేశారు. విద్యార్థుల నృత్యాలు, భక్తిగీతాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పాఠశాల ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వ్యవస్థాపక అవగాహన, ప్రత్యేక విక్రేత అభివృద్ధి' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో రాణించి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు. ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వ కొనుగోళ్లు, మార్కెటింగ్, రుణ సదుపాయాలపై అవగాహన కల్పించడం సదస్సు ఉద్దేశమన్నారు. ఉట్నూరులో త్వరలో




ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునీతకుమారి, ఎఫ్‌సీఐ మేనేజర్లు ఎస్.ప్రదీప్, దాసరి కృష్ణ, ఎల్‌డీఎం ఉత్పల్‌కుమార్ దామ్, ప్రతినిధులు రాజేష్‌కుమార్ యాదవ్, రవివర్మ, బి.సరిత, ఎం.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ జయంతి వేడుకల్లో బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆదిలాబాద్ టీఎన్‌జీవో గార్డెన్‌లో మరాఠీ విశ్వకర్మ వడ్రంగి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలకు మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, సంఘం సభ్యులు శ్రీకాంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ వృత్తులను కాపాడుకుంటూ ఆధునికతకు అనుగుణంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విశ్వకర్మ భగవాన్ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని



ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ జెడ్పీ చైర్మన్ సుహాసిని రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు చిక్కాల దత్తు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

**మంచిర్యాల, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సమగ్ర ప్రణాళికలను రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవనం, మత్స్య, వైద్యం, విద్య, తాగునీరు, పారిశుద్ధ్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామసభలు, పంచాయతీలు, స్వయం సహాయక సంఘాల ప్రతిపాదనలను సమన్వయం చేసి గ్రామ సమృద్ధి ప్రణాళికను గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికతో అనుసంధానం చేయాలని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి అవార్డుల ప్రక్రియ వేగవంతం



**మంచిర్యాల, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
జిల్లాలో జాతీయ రహదారి 63 విస్తరణకు సంబంధించి అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంచిర్యాల ఆర్‌డీఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఆర్‌డీఓ శ్రీనివాస్‌రావుతో కలిసి భూసేకరణకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అవార్డుల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పుష్కరాల పనులు గడువులోగా పూర్తి చేయాలి



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి విలేఖరి)**
గోదావరి పుష్కరాల పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాసర ఈవో కార్యాలయంలో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. భక్తులు, వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రవాణా, తాగునీరు, మరుగుదొడ్లు, హెలిప్యాడ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రద్దీ నియంత్రణ, భక్తుల సంఖ్య లెక్కింపునకు కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించాలని, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం బాసరలో హెలిప్యాడ్ ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. సమావేశంలో భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, ఆర్‌అండ్‌బీ ఈఈ సుభాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, నీటిపారుదల శాఖ ఈఈ అనిల్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు

## అంజనీపుత్ర వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు



**మంచిర్యాల, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి)**
పట్టణంలోని చున్నంబట్టివాడ 100 ఫీట్ రోడ్డులో అంజనీపుత్ర ఎస్టేట్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వరసిద్ధి వినాయకుడిని డీసీపీ ఏ. భాస్కర్, ఆర్‌డీఓ శ్రీనివాసరావు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని, తొమ్మిది రోజులపాటు అన్నదానం చేపట్టడం ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంజనీపుత్ర ఎస్టేట్ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజ



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
రామకృష్ణాపూర్ పట్టణంలోని గణేష్ నగర్ శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గణనాథుడికి పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలి కమిటీ సభ్యులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. ప్రతి ఏడాది ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## అచ్చంపేటలో నేడే వినాయక నిమజ్జనం



**అచ్చంపేట, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో శనివారం జరిగే గణేష్ నిమజ్జనోత్సవానికి పురపాలక సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నడింపల్లి చెరువు వద్ద విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఉత్సవ కమిటీలు, భక్తులు నిర్దేశించిన ప్రాంతంలోనే నిమజ్జనం నిర్వహించాలని, వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## మినసాపల్లిలో రైతు వేదికలో సమీక్ష



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎల్లారెడ్డి మండలం మిసనాపల్లి రైతు వేదికలో ఆరు మండలాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్, పిట్లం, పెద్దకొడపగల్, నిజాంసాగర్ మండలాల సీసీలు, స్త్రీనిధి సిబ్బంది, వీఓఏలతో బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, టాస్, ఫార్మ్, నాన్‌ఫార్మ్, వీఓ లావాదేవీలు, ఎంటర్‌ప్రైజెస్ బిజినెస్ తదితర అంశాలపై సమీక్షించి కమిట్మెంట్లు తీసుకున్నారు. సమీక్షలో ఏపీడీ విజయలక్ష్మి, డీపీఎంలు శ్రీనివాస్, రాజయ్య, సాయిలు, సురేష్, ఎస్ఎన్ఆర్ఎం కిరణ్, ఆరు మండలాల ఏపీఎంలు రామ్‌నారాయణ్ గౌడ్, ప్రసన్నరాణి, వినోద్, గంగారాం, దత్తు, సాయిలు, బిట్స్ పిలాని వినోద్, అకౌంటెంట్ మహేష్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో వెదురుకు ప్రాధాన్యం



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి విలేఖరి):**
వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి కల్పన, సంప్రదాయ వృత్తుల పరిరక్షణలో వెదురు ఉత్పత్తులకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. మేదర వృత్తిదారులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేసి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, సత్యనారాయణ, జిల్లా మేదర సంఘం ప్రధాన కార్యదర్శి ఊరె దశరథ్, దూడ ప్రమోద్, ఎనుగందుల రాజేందర్, మదిరె కృష్ణమోహన్, ఎనుగందుల రాజన్న, కనికరం శేఖర్, జొరిగల రాజలింగం, మదిరె మురళి, కనికరం రవి, మదిరె సత్యనారాయణ, కనికరం రాజేందర్, మాద విజయ్, పిల్లి సాయికుమార్, మదిరె వసంత్ తదితరులు పాల్గొన్నారు

## నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే అండ



**మంచిర్యాల, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):**
అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 40వ డివిజన్ మజీద్‌వాడకు చెందిన మహ్మద్ రిజ్వాన్ కుటుంబానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అండగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.2.05 లక్షల ఎల్ఓసీని రిజ్వాన్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అవసరమైన ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

## నిజామాబాద్ స్టార్ హెల్త్ సెంటర్‌లో ఉచిత ఆరోగ్య సేవలు




**నిజామాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్ స్టార్ హెల్త్ సెంటర్‌లో ఉచిత ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ కన్సల్టేషన్, ప్రాథమిక పరీక్షలు, మందులు, ఆరోగ్య కౌన్సెలింగ్, టీకాలపై మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి 3,800 మందికి పైగా సేవలు పొందారని, 1,900 మందికి పైగా మధుమేహం, 2,700 మందికి పైగా హైపర్టెన్షన్ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కేంద్రంలో వైద్యుడు, నర్సు, సహాయక సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రీజినల్ హెడ్ సురేష్, డాక్టర్ సాయి చరణ్, పీఆర్ఓ తేజస్వి బండారి పాల్గొన్నారు.



# అజిత్ అగార్కర్ ఔట్..

### చీఫ్ సెలెక్టర్ రేసులో ఇద్దరు సీనియర్లు !

ముంబై: సీనియర్ పురుషుల క్రికెట్ జట్టుకు చీఫ్ సెలెక్టర్‌గా ఉన్న అజిత్ అగార్కర్ పదవీకాలం ఈనెలాఖరుతో ముగియనున్నది. కాంట్రాక్టు సమయం దగ్గరపడిన నేపథ్యంలో మళ్లీ అజిత్ అగార్కర్‌కు పొడిగింపు వస్తుందో లేదో తెలియడం లేదు. కానీ కొన్ని మీడియా సంస్థల ప్రకారం అగార్కర్‌ను ఆ పోస్టు నుంచి తప్పించనున్నట్లు తెలిసింది. భారత మాజీ సీనియర్ క్రికెటర్లు పార్థీవ్ పటేల్, ప్రజ్ఞా ఓజా.. చీఫ్ సెలెక్టర్ రేసులో ఉన్నట్లు ఓ ఆంగ్ల మీడియా కథనాన్ని రాసింది. అజిత్ అగార్కర్ భవిష్యత్తుపై ఇటీవల ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది వరల్డ్‌కప్ వరకు అగార్కర్ కాంట్రాక్టు పొడిగిస్తారని కూడా రూమర్స్ వినిపిస్తున్నాయి. కానీ బీసీసీఐలోని కొన్ని వర్గాలు.. అగార్కర్ పదవీకాలం ముగిసినట్లు చెబుతున్నారు. శుక్రవారం జరగనున్న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో అగార్కర్ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. అగార్కర్ తన చివరి సెలెక్షన్ మీటింగ్‌ను బుధవారమే నిర్వహించినట్లు కొన్ని వర్గాలు పేర్కొన్నాయి. బీసీసీఐ సెలెక్షన్ కమిటీ చైర్మెన్ రేసులో మాజీ వికెట్ కీపర్ పార్థీవ్ పటేల్, స్పిన్నర్ ప్రజ్ఞా ఓజా ఉన్నట్లు తెలుస్తోంది.

# హర్మన్‌ప్రీతే బెస్ట్ కెప్టెన్..

**కెప్టెన్సీ మార్పుపై అంజుమ్ కీలక వ్యాఖ్యలు**

**భారత మహిళా జట్టు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కొనసాగాలన్న అంజుమ్ చోప్రా**

**ప్రస్తుతానికి జట్టును నడిపించగల ఉత్తమ వ్యక్తి హర్మన్‌ప్రీతేనని స్పష్టీకరణ**

**ఆసియా కప్‌లో ఫామ్‌లో లేకపోయినా తిరిగి పుంజుకుంటుందని ధీమా**

**కెప్టెన్‌గా, బ్యాటర్‌గా ఆమె సేవలు జట్టుకు అవసరమన్న అంజుమ్**



న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్సీ మార్పుపై చర్చ జరుగుతున్న తరుణంలో, మాజీ కెప్టెన్ అంజుమ్ చోప్రా ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గట్టి మద్దతు తెలిపింది. ఇటీవలి కాలంలో బ్యాటింగ్‌లో రాణించక పోయినా, జట్టును నడిపించడానికి ఆమెనే సరైన వ్యక్తి అని స్పష్టం చేసింది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన టీ20 ఆసియా కప్‌ను భారత్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి గెలుచుకుంది. అయితే, ఈ టోర్నీలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ 5 మ్యాచ్‌ల్లో కేవలం 71 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచింది. దీనికి తోడు ఆమె వయసు 37 ఏళ్లు కావడంతో, వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు కెప్టెన్సీ అప్పగించాలనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో మాట్లాడిన అంజుమ్ చోప్రా, కెప్టెన్సీ మార్పుపై వస్తున్న చర్చలను తోసిపుచ్చింది. "ప్రస్తుతానికి భారత జట్టును నడిపించడానికి హర్మన్‌ప్రీతే ఉత్తమ కెప్టెన్. ఆమె బ్యాటింగ్ ప్రదర్శనపై విమర్శలు వస్తున్నాయి. కానీ, ప్రతిసారీ ఆమె నుంచి 2017 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఆడిన 171 పరుగుల వంటి ఇన్నింగ్స్‌ను ఆశించలేం" అని పేర్కొంది. రాబోయే ఆసియన్ గేమ్స్, ఇతర సిరీస్‌లతో హర్మన్‌ప్రీత్ తిరిగి ఫామ్‌లోకి వస్తుందని అంజుమ్ చోప్రా ధీమా వ్యక్తం చేసింది. "ముఖ్యమైన టోర్నమెంట్ల నాటికి బ్యాట్‌తో రాణించడం ఎంత ముఖ్యమో ఆమెకు తెలుసు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా ఆమె సేవలు భారత జట్టుకు ఇంకా ఎంతో అవసరం" అని వివరించింది.

# విచారణకు హాజరుకావాల్సిందే..

**పాక్ క్రికెటర్ రిజ్వాన్‌కు కోర్టు ఆదేశం**

**పాక్ క్రికెటర్ మహమ్మద్ రిజ్వాన్ పిటిషన్‌ను కొట్టివేసిన లాహోర్ హైకోర్టు**

**సైబర్ క్రైమ్ ఏజెన్సీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేసిన వికెట్ కీపర్**

**నోటీసులకు సమాధానం ఇవ్వాలని కోర్టు స్పష్టీకరణ**

**విచారణకు సహకరించాలన్న న్యాయస్థానం**

**రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌ల ఫోన్లపై కొనసాగుతున్న ఫోరెన్సిక్ పరీక్ష**

**ఏజెన్సీ నివేదిక ఆధారంగా ఆటగాళ్లపై చర్యలు తీసుకోనున్న పీసీబీ**



ఇస్లామాబాద్: పాకిస్థాన్ సీనియర్ క్రికెటర్లు మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌ల భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. 'నేషనల్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ' (ఎన్‌సీసీఐఏ) జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ వికెట్ కీపర్ బ్యాటర్ రిజ్వాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను లాహోర్ హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ ఇద్దరు ఆటగాళ్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే దిశగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ (పీసీబీ) అడుగులు వేసే అవకాశం కనిపిస్తోంది.

నేడు ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన లాహోర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలియా నీలమ్, ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత దానిని కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. విచారణ సందర్భంగా రిజ్వాన్ తరఫు న్యాయవాది ఖాజీ ఉమైర్ అలీ వాదనలు వినిపిస్తూ, తన క్లయింట్‌కు ఎన్‌సీసీఐఏ నోటీసులు జారీ చేసిందని తెలిపారు. దీనిపై స్పందించిన చీఫ్ జస్టిస్, "మీరు వెళ్లి నోటీసులకు సమాధానం ఇవ్వాలి. మీకు నోటీసు ఎప్పుడు జారీ అయింది?" అని ప్రశ్నించారు.

లార్డ్స్ టెస్ట్ తర్వాత తన క్లయింట్‌ను హోటల్ లాబీకి పిలిచి, ఎలాంటి నోటీసు లేకుండా విచారించారని, అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారని న్యాయవాది కోర్టుకు వివరించారు. మూడు గంటల్లో ఫోన్ తిరిగి ఇస్తామని చెప్పి తీసుకున్నారని, కానీ ఇప్పటికీ ఇవ్వలేదని, ఇది దురుద్దేశాన్ని సూచిస్తోందని వాదించారు.




## బిజినెస్ Business

# టాటా సన్స్‌లో కీలక మలుపు..

**చైర్మన్‌గా చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్ల పొడిగింపు!**

**చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్లు ఇవ్వాలని బోర్డు మద్దతు**

**టాటా సన్స్ లిస్టింగ్‌కు బోర్డు ఆమోదం**

**రెండు ప్రతిపాదనలను నోయెల్ టాటా వ్యతిరేకించినట్లు సమాచారం**

**ఆర్‌బీఐ ఆదేశాలతో వేగం పుంజుకున్న లిస్టింగ్ ప్రక్రియ**

**పదవి కొనసాగబోనని ఆగస్టులో ప్రకటించిన చంద్రశేఖరన్**

**బోర్డు నిర్ణయంతో టాటా సన్స్‌లో నాయకత్వంపై మలుపు**



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ భవిష్యత్ నాయకత్వంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడేలా కీలక పరిణామం చోటుచేసుకుంది. టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్ల పదవీకాలం ఇవ్వడంతో పాటు కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. అయితే ఈ రెండు ప్రతిపాదనలను టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా వ్యతిరేకించినట్లు ఎన్‌డీటీవీ ప్రాఫిట్ కథనం పేర్కొంది.

### నోయెల్ టాటా అభ్యంతరం

టాటా ట్రస్ట్స్ తరఫున బోర్డులో నోయెల్ టాటాకు వీటో హక్కు ఉంది. చంద్రశేఖరన్ కొనసాగింపుతో పాటు లిస్టింగ్ ప్రతిపాదనపై ఆయన అసమ్మతి వ్యక్తం చేసినట్లు సమాచారం. తన వీటో అధికారాన్ని ఉపయోగించి తీర్మానాలను అడ్డుకునేందుకు ప్రయత్నించినా, ఇతర బోర్డు సభ్యుల మద్దతుతో ప్రతిపాదనలు ఆమోదం పొందినట్లు కథనం తెలిపింది.

### ఆర్‌బీఐ ఆదేశాలతో లిస్టింగ్

టాటా సన్స్ లిస్టింగ్ అంశం కొంతకాలంగా పెండింగ్‌లో ఉంది. ఆర్‌బీఐ తాజాగా కంపెనీ లిస్టింగ్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించింది. 2022లో టాటా సన్స్‌ను 'అప్పర్ లేయర్' ఎన్‌బీఎఫ్‌సీగా ఆర్‌బీఐ గుర్తించింది. దీంతో మూడేళ్లలోగా స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాల్సిన నిబంధన ఏర్పడింది.

### చంద్రశేఖరన్ పదవీకాలం

చంద్రశేఖరన్ 2017 ఫిబ్రవరిలో టాటా సన్స్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2022లో ఆయనకు రెండోసారి ఐదేళ్ల పదవీకాలం లభించింది. అది 2027 ఫిబ్రవరి 20తో ముగియాల్సి ఉంది. అయితే మరోసారి బాధ్యతలు చేపట్టబోనని ఆయన ఈ ఏడాది ఆగస్టులో బోర్డుకు తెలియజేశారు.

### మళ్లీ నాయకత్వంపై మలుపు

టాటా గ్రూప్‌లో వ్యాపారాల పనితీరు, మూలధన కేటాయింపుపై నోయెల్ టాటా ఆందోళనలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా ఎయిరిండియా, టాటా డిజిటల్ అంశాలు చర్చకు వచ్చాయి. దీంతో చంద్రశేఖరన్ వారసుడి ఎంపికపై టాటా ట్రస్ట్స్ కసరత్తు ప్రారంభించింది. ఇప్పుడు బోర్డు నిర్ణయంతో ఆ వ్యవహారం మరో మలుపు తిరిగింది.

# ఫెడ్ ఎఫెక్ట్.. మిశ్రమంగా ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**21.86 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

**53 పాయింట్లు లాభపడిన నిఫ్టీ**

**మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీల్లో లాభాలు**

**రియల్టీ, ఆటో, మెటల్ షేర్లలో కొనుగోళ్లు**

**బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**ఫెడ్ నిర్ణయం తర్వాత రూపాయిపై ఒత్తిడి ఉండొచ్చన్న నిపుణులు**




ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 21.86 పాయింట్లు నష్టపోయి 74,314.59 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 53 పాయింట్లు లాభపడి 23,270.60 వద్ద ముగిసింది.

నిఫ్టీ 23,300 స్థాయి వద్ద కీలక నిరోధాన్ని ఎదుర్కొంటోందని మార్కెట్ నిపుణులు తెలిపారు. ఈ స్థాయిని దాటితే 23,500 వరకు నిఫ్టీ పుంజుకునే అవకాశం ఉందన్నారు. 23,200 నుంచి 23,000 స్థాయిల వద్ద మద్దతు లభించవచ్చని పేర్కొన్నారు.

కొన్ని బడా కంపెనీల షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు నిఫ్టీలో భారీగా లాభపడ్డాయి. విస్తృత మార్కెట్లు మాత్రం బెంచ్‌మార్క్ సూచీలను మించి రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.92 శాతం పెరిగింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 0.76 శాతం లాభపడింది. రియల్టీ, ఆటో, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. మరోవైపు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు నష్టపోయాయి.

అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన నిర్ణయం ప్రభావాన్ని ఇన్వెస్టర్లు అంచనా వేయడంతో మార్కెట్లు ఒక పరిమిత శ్రేణిలో కదిలాయని నిపుణులు తెలిపారు. అదే సమయంలో వివిధ రంగాల షేర్లలో కదలికలు మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేశాయని చెప్పారు.

మరోవైపు అమెరికా ఫెడ్ నిర్ణయం తర్వాత రూపాయి మరింత ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేశారు. డాలర్‌తో రూపాయి విలువ 96 స్థాయిని దాటే అవకాశం ఉందన్నారు. డాలర్-రూపాయి మారకంలో 96.25 వద్ద తక్షణ నిరోధం ఉందని, 95.40-95.75 మధ్య మద్దతు లభించవచ్చని విశ్లేషించారు.

# మళ్లీ పెరగనున్న టాటా వాహనాల ధరలు..

**అక్టోబర్ నుంచి కొత్త రేట్లు**

**అక్టోబర్ 1 నుంచి టాటా కమర్షియల్ వాహనాల ధరలు పెంపు**

**గరిష్ఠంగా 1 శాతం వరకు ధరల పెరుగుదల**

**మోడల్, వేరియంట్‌ను బట్టి పెంపు**

**ఈ ఏడాదిలో రెండోసారి కమర్షియల్ వాహనాల ధరల పెంపు**

**ముడిసరుకు, ఇతర ఇన్‌పుట్ ఖర్చులు పెరగడమే కారణం**




న్యూఢిల్లీ: కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి టాటా మోటార్స్ షాక్ ఇచ్చింది. తమ వాణిజ్య వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. 2026 అక్టోబర్ 1 నుంచి అన్ని కమర్షియల్ వెహికల్స్ ధరలను గరిష్ఠంగా 1 శాతం వరకు పెంచనున్నట్లు గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ప్రకటనలో తెలిపింది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెంపు మారుతుందని స్పష్టం చేసింది.

పెరుగుతున్న ముడిసరుకు ధరలు, ఇతర ఉత్పత్తి వ్యయాల ప్రభావాన్ని కొంత మేర భర్తీ చేసుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు టాటా మోటార్స్ తెలిపింది. ఈ ఆటోమొబైల్ దిగ్గజ సంస్థ ఈ ఏడాదిలో కమర్షియల్ వాహనాల ధరలను పెంచడం ఇది రెండోసారి. ఏప్రిల్ 1 నుంచి ఇదే విభాగంలోని వాహనాల ధరలను గరిష్ఠంగా 1.5 శాతం పెంచింది.

ప్రయాణికుల వాహనాల ధరల విషయంలోనూ టాటా మోటార్స్ ఇదే బాటలో నడిచింది. జులై 1 నుంచి ప్యాసింజర్ వెహికల్ శ్రేణిలో ధరలను గరిష్ఠంగా 1.5 శాతం పెంచింది. ఇందులో పెట్రోల్, డీజిల్ వాహనాలతో పాటు ఎలక్ట్రిక్ కార్లు కూడా ఉన్నాయి. అంతకుముందు ఏప్రిల్‌లో ఇంధన ఆధారిత కార్ల ధరలను 0.5 శాతం పెంచింది. కొన్ని వేరియంట్లపై ఈ పెంపు 1.09 శాతం వరకు ఉండగా.. టాటా ఆల్ట్రోజ్ ధర మాత్రం స్వల్పంగా తగ్గింది.

ముడిసరుకు ధరలు, రవాణా ఖర్చులు, సరఫరా వ్యవస్థ వ్యయాలు, కరెన్సీ మార్పిడి రేట్లలో హెచ్చుతగ్గుల కారణంగా వాహన తయారీ సంస్థలు ధరలను సవరిస్తున్నాయి. మారుతి సుజుకీ జూన్ నుంచి వాహనాల ధరలను గరిష్ఠంగా రూ.30,000 వరకు పెంచింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా జూన్ 1 నుంచి గరిష్ఠంగా రూ.12,800 వరకు ధరలు పెంచింది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా, బీఎండబ్ల్యూ ఇండియా, మెర్సిడెస్ బెంజ్ ఇండియా, ఆడి ఇండియా, హోండా కార్స్ ఇండియా కూడా ఇదే సమయంలో ధరలు పెంచాయి.

టాటా గ్రూప్‌లో భాగమైన టాటా మోటార్స్ భారత్‌తో పాటు దక్షిణ కొరియాలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆఫ్రికా, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఆగ్నేయాసియా, సార్క్ దేశాల



## 20 ఏళ్లలో ఇంతటి అందగాడిని చూడలేదట..!

మిల్కీ బ్యూటీ తమన్నా కెరీర్ ఖతం అని అనుకున్న ప్రతిసారి లక్కీగా ఆఫర్లు దక్కించుకుంటూ వస్తుంది. గత పదేళ్లుగా టాలీవుడ్‌లో అడపా దడపా సినిమాల్లో కనిపిస్తూ బాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేస్తున్న ఈ ముద్దుగుమ్మ తాజాగా 'ది వాన్' అనే హిందీ సినిమాలో నటించింది. సిద్దార్థ్ మల్హోత్రా హీరోగా నటించిన ఈ సినిమాలో తమన్నా హీరోయిన్‌గా నటించడం ద్వారా మరోసారి బాలీవుడ్ మీడియాలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తమన్నా బాలీవుడ్‌లో సైతం ఇక మీదట ఆఫర్లు అందుకోవడం కష్టం అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయింది. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం జరిగింది.

తమన్నా 'ది వాన్' మూవీ ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో మాట్లాడుతూ... సిద్దార్థ్ మల్హోత్ర మంచి కో స్టార్ అంది. అంతే కాకుండా తన 20 ఏళ్ల సినీ ప్రస్థానంలో సిద్దార్థ్ మల్హోత్ర వంటి దయా హృదయుడిని చూడలేదని, అంతే కాకుండా ఇంతటి అందగాడిని కూడా చూడలేదు అంది. హ్యాండ్సమ్ అనే పదంకు సిద్దార్థ మల్హోత్ర సరిగ్గా సెట్ అవుతాడు అంది. సినిమాలో అతడితో కలిసి ప్రయాణించడం సంతోషాన్ని ఇచ్చిందని తమన్నా చెప్పుకొచ్చింది. ఒక మంచి కోస్టార్, ఒక మంచి వ్యక్తి అని సిద్దార్థ్ గురించి తమన్నా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఒక హీరో గురించి ఈ స్థాయిలో ఒక హీరోయిన్ మాట్లాడటం చాలా అరుదుగా చూస్తూ ఉంటామని, మనసుకు నచ్చిన వారి గురించి మాత్రమే ఇలా మాట్లాడుతారని, మనసులో ఉన్న వారి గురించి మాత్రమే ఇలా మాట్లాడగలరు అని పలువురు సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు.



## ఆ విషయంలో రష్మిక తర్వాతే ఎవరైనా!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న గత ఏడాది ఏకంగా అయిదు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అందులో 'ఛావా' ఏ స్థాయి విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బాలీవుడ్‌తో పాటు దేశ వ్యాప్తంగా ఛావా సినిమా సూపర్ హిట్‌గా నిలవడంతో పాటు, ఆ సినిమాలో రష్మిక పోషించిన యేసు బాయి పాత్రకు మంచి పేరును సొంతం చేసుకుంది. ఇంకా గత ఏడాదిలోనే వచ్చిన థామా, గర్ల్ ఫ్రెండ్ సినిమాలతోనూ రష్మిక మందన్న నటిగా మంచి దక్కించుకుంది. గత ఏడాది నటిగా సంతృప్తిని ఇచ్చే పాత్రలతో పాటు, కమర్షియల్‌గా సూపర్ హిట్ అయిన సినిమాలను చేయడం ద్వారా రష్మిక మందన్నకు గత ఏడాది గుర్తుండి పోతుంది అనడంలో సందేహం లేదు. అయితే ఈ ఏడాది రష్మిక జోరు గత ఏడాది స్థాయిలో లేదని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రష్మిక నటించిన కాక్‌టెయిల్ 2 మాత్రమే విడుదలైంది. ఈ ఏడాది చివర్లో రష్మిక మందన్న సినిమాల సందడి ఉండబోతుంది. వచ్చే నెలలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన 'రణబాలి' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. పెళ్లి తర్వాత విజయ్, రష్మిక కలిసి నటించిన మొదటి సినిమా ఇదే కావడంతో ఆసక్తి మరింతగా పెరిగింది. రణబాలిలో రష్మిక లుక్‌కి మంచి మార్కులు పడ్డాయి. ఇక రష్మిక నటించిన లేడీ ఓరియంటెడ్ మూవీ 'మైసా' సైతం ఇదే ఏడాదిలో విడుదల కాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మైసాను ఇప్పటికే విడుదల చేయాలని మేకర్స్ భావించినప్పటికీ షూటింగ్ ఆలస్యం కావడంతో విడుదల ఆలస్యం అయింది. ఈ ఏడాది చివరి వరకు అయినా మైసాను విడుదల చేయాలనే పట్టుదలతో ఉన్నారు. రణబాలి, మైసా సినిమాలతో ఈ ఏడాది రాబోతున్న రష్మిక మందన్న మరో వైపు అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' సినిమాలోనూ కీలక పాత్రలో కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఇన్ని సినిమాలు ఉండగానే తాజాగా రష్మిక లెజెండ్రీ సింగర్ ఎంఎస్ సుబ్బలక్ష్మి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందబోతున్న 'ఎం ఎస్' సినిమాకు సైన్ చేసింది. ఇటీవల కమల్ హాసన్ చేతుల మీదుగా ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అయింది. ఎంఎస్ సుబ్బలక్ష్మి వంటి లెజెండ్రీ సింగర్ బయోపిక్‌లో నటించే అవకాశం దక్కించుకోవడం అనేది కచ్చితంగా గొప్ప విషయం. రష్మికకు దక్కిన ఈ ఆఫర్‌ను అదృష్టంగా ఆమె అభిమానులు మాట్లాడుకుంటున్నారు. బాలీవుడ్‌లో ఎంతో మంది స్టార్స్ ఉండగా, సౌత్‌లోనూ చాలా మంది సీనియర్, జూనియర్ స్టార్ హీరోయిన్స్ ఉండగా రష్మికకి ఈ ఛాన్స్ దక్కడం అంటే మామూలు విషయం కాదు.



## చీరకట్టులో అనసూయ గ్లామర్ టచ్!

బుల్లితెరపై యాంకర్‌గా రచ్చ చేసి, వెండితెరపై నటిగా తనదైన ముద్ర వేసిన అందాల భామ అనసూయ భరద్వాజ్ తాజాగా పోస్ట్ చేసిన చీరకట్టు ఫోటోలు ఇంటర్నెట్‌లో షేక్ చేస్తున్నాయి. సాంప్రదాయ దుస్తుల్లోనూ తనదైన గ్లామర్ టచ్ ఇస్తూ, కర్లీ హెయిర్‌తో ఆమె ఇచ్చిన పోజులు కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ట్రెండింగ్‌లో ఉండే ఈ గ్లామరస్ యాంకర్, లేటెస్ట్‌గా పంచుకున్న ఈ స్టైలిష్ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ విశేషాలు మీకోసం.. తాజా ఫోటోషూట్ కోసం అనసూయ ఆలివ్ గ్రీన్ కలర్ జార్జెట్ చీరను ఎంచుకుంది. క్లాసిక్ వైట్ బ్లాక్-ప్రింటెడ్ స్ట్రిప్స్ పాటర్న్‌తో ఉన్న ఈ చీరకు మ్యాచింగ్‌గా ఆలివ్ గ్రీన్ స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించి ఎంతో అందంగా మెరిసిపోయింది. ఇక దీనికి తోడు ఓపెన్ అండ్ ఓవీ కర్లీ హెయిర్‌స్టైల్ జతచేసి ఇచ్చిన పోజులు ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణను తెచ్చిపెట్టాయి. సోషల్ మీడియాలో ఈ పిక్స్ షేర్ చేసిన క్షణాల్లోనే విపరీతంగా వైరల్ అయ్యాయి. అనసూయ అందాన్ని చూసి ఫిదా అయిన అభిమానులు "బ్యూటిఫుల్", "క్యూట్", "నైస్", "ఈ లుక్‌లో నువ్వు నిజంగా మైమరపిస్తున్నావ్" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఇక నిత్యం ఫిట్‌నెస్, వర్కౌట్ వీడియోలతో పాటు ఇలాంటి గ్లామరస్ ఫోటోషూట్లతో అనసూయ నెటిజన్లను అలరిస్తోంది.

## 'ప్యారడైజ్'తో నాని మార్కెట్.. ఒక్కసారిగా ఇంత పెరిగిందా?

నాని ది ప్యారడైజ్ విడుదలకు ఇంకా వారం ఉండగానే బిజినెస్ లెక్కలు హాట్ టాపిక్ అవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే రూ.100 కోట్లకు పైగా థియేట్రికల్ బిజినెస్ జరిగిందనే టాక్ వస్తోంది. అయితే ఏరియా వారీగా బయటకు వచ్చిన మరో ట్రేడ్ లెక్కలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి రూ.75.7 కోట్లుగా ఉంది. తెలుగు వెర్షన్ వరల్డ్‌వైడ్ హక్కులు మాత్రం రూ.103.7 కోట్ల వరకు వెళ్లినట్లు చెబుతున్నారు. ఏ లెక్క తీసుకున్నా నాని కెరీర్‌లో ఇది పెద్ద జంప్. సరిపోదా శనివారం.. తెలుగు రాష్ట్రాల బిజినెస్ దాదాపు రూ.30 కోట్ల దగ్గరే ఉంది. అక్కడి నుంచి ప్యారడైజ్ రూ.75 కోట్లకు పైగా వెళ్లడం అంటే రెండేళ్లలోనే మార్కెట్ రెండింతలకు మించి పెరిగింది. దసరా, హాయ్ నాన్న, హిట్ 3 సినిమాలు మంచి బూస్ట్ ఇచ్చాయి.



రి'దసరా' తర్వాత శ్రీకాంత్ ఓదెలతో నాని చేస్తున్న రెండో సినిమా కావడం కూడా 'ప్యారడైజ్' బిజినెస్‌కు కలిసొచ్చింది. 'దసరా' నాని కెరీర్‌లోనే భారీ వసూళ్లు సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు అదే కాంబినేషన్ మరింత పెద్ద బడ్జెట్‌తో 'ప్యారడైజ్' చేసింది. దానికి అనిరుధ్ సంగీతం, పాన్ ఇండియా రిలీజ్ కూడా తోడయ్యాయి. నైజాం హక్కులే రూ.35 కోట్ల వరకు వెళ్లినట్లు ట్రేడ్ వర్గాల్లో లెక్కలు వినిపిస్తున్నాయి. అయితే ఒక్క 'ప్యారడైజ్'తోనే నాని టైర్ 1లోకి వచ్చేశాడని చెప్పేయడం కాస్త తొందరే. పెద్ద హీరోల సినిమాలకు ఈ స్థాయి బిజినెస్ ఒక్క సినిమాతో ఆగదు. తర్వాతి సినిమాలకు కూడా అదే రేంజ్‌లో రేట్లు రావాలి. ఓపెనింగ్స్ కూడా ఆ స్థాయిలో ఉండాలి. నాని తర్వాతి సినిమాకు కూడా బయ్యర్లు ఇదే రేంజ్‌లో వెళ్లితేనే ఈ మార్కెట్ నిలబడినట్లు అవుతుంది. తెలుగు వెర్షన్ వరల్డ్‌వైడ్ బిజినెస్ రూ.100 కోట్లకు పైగా ఉంటే 'ప్యారడైజ్'కు కూడా పెద్ద టార్గెట్ ఉన్నట్టే. నాని గత సినిమాలతో పోలిస్తే ఈసారి ఎక్కువ షేర్ రావాల్సి ఉంటుంది. ఓవర్సీస్ హక్కులు కూడా రూ.18 కోట్ల వరకు వెళ్లినట్లు ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తోంది. మొదటి రోజు నుంచే ఈ బిజినెస్‌కు తగ్గ ఓపెనింగ్స్ వస్తే నాని మార్కెట్ గురించి తర్వాతి లెక్కలు ఇంకా పెరగొచ్చు. సెప్టెంబర్ 24న సినిమా విడుదల కానుంది. ట్రైలర్ లేకుండానే థియేటర్లలోకి వెళ్లాలని టీమ్ నిర్ణయించడం మరో హైలెట్ ట్విస్ట్.మీ. సెప్టెంబర్ 23 రాత్రి నుంచే పెయిడ్ ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఆ షోల నుంచే టాక్ బలంగా వస్తే నాని కొత్త బిజినెస్ రేంజ్‌కు బాక్సాఫీస్ దగ్గర మొదటి ఛాలెంజ్ అక్కడే మొదలవుతుంది. మరి ది ప్యారడైజ్ ఆడియన్స్ అంచనాలను ఎంతవరకు అందుకుంటుందో చూడాలి.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com